
సాక్షి ఒడిశా

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 4,71,602

బంగారం 19 గ్రాముల 400 మిల్లీ గ్రాములు

వెండి 46 గ్రాములు

భువనేశ్వర్/పూరీ



ఘనంగా బల్ల పండగ

పర్లాకిమిడిలో బల్ల పండగ ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు చేశారు.

- 8లో

ఓపీసీసీ అధ్యక్షుడిగా..



ఓపీసీసీ అధ్యక్షుడిగా భక్తచరణ్‌దాస్ నియమితుల య్యారు. ఆ మేరకు ఉత్తర్వులు వచ్చాయి.

- 8లో

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ రిక్షాల అందజేత



దివ్యాంగులకు ఈ-రిక్షాలు అందజేస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఏడు సమితి కేంద్రాలలో అధికారులు గుర్తించిన ఏడుగురు దివ్యాంగులకు ఎలక్ట్రిక్ రిక్షాలను జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ మంగళవారం అందజేశారు. జిల్లా సామాజిక భద్రత, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్‌డీవో సంతోష్ కుమార్‌నాయక్, నువాగడ, గుమ్మా, ఆర్.ఉదయగిరి, మోహానా, గుమ్మా, గుసాని, కాశీనగర్ సామాజిక భద్రత శాఖ అధికారులు పాల్గొన్నారు. సంబల్‌పూర్‌లోని మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ సహకారం, సీఎస్ఆర్ నిధులతో రెండున్నర లక్షల రూపాయల విలువైన రిక్షాలను సమకూర్చారు.

సంగీత దర్శకులు రఘునాథ పాత్రోకు సత్కారం



రఘునాథ పాత్రోను సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన ప్రముఖ సంగీత దర్శకులు పండిత రఘునాథ పాత్రోకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ శిల్పారామంలో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్.అధికారి బి.పి.ఆచార్య నేతృత్వంలో రఘునాథ పాత్రోను సత్కరించారు. ఈ నెల ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ శిల్పారామంలో జరిగిన ఒడిశా ఫుడ్, క్రాఫ్ట్ మేళా 2025'లో రఘునాథ పాత్రోను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఒడిశా మేళాలో ఆయన తన ఒడిస్సీ సంగీతంతో ప్రజలను మంత్రముగ్ధులను చేశారు. ఒడిషాలో సాహిత్యం, కళలు, సంగీతం, నాట్యంపై ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ఒడిస్సీ శిల్ప మేళాలో శక్తిధర ఖడంగ, అంజనకుమార్ పాత్రో, అర్పనామిశ్రా, షీలా సాహు పాల్గొన్నారు.

టార్పాలిన్ల దొంగ పట్టివేత



టార్పాలిన్లు దొంగిలించి డ్రైవర్‌కు దొరికిన విజయ నాయిక్

జయపురం: జయపురం సమితి భరిణిపుట్ ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉన్న విలువైన టార్పాలిన్లను దొంగిలించడానికి ప్రయత్నించిన వ్యక్తిని ట్రక్కు డ్రైవర్ పట్టుకున్నారు. దొరికిన వ్యక్తిని విజయ నాయిక్‌గా గుర్తించారు. డ్రైవర్ విషయం తెలపగానే ట్రక్కు యజమాని సంఘటనా స్థలానికి చేరుకొని ఆటోలో ఉన్న టార్పాలిన్లు తీసుకెళ్లిపోయారు. దొంగను భరిణిపుట్ పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పారిపోయారని డ్రైవర్ పోలీసులకు తెలిపాడు. జయపురం సదర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి మంగళవారం వెల్లడించారు.

పదెకరాల గడ్డివాములు దగ్ధం



బిసింగపూర్‌లో కాలి బూడిదైన గడ్డి వాములను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి భైరవ సింగపూర్(బిసింగపూర్) గ్రామంలో ఒక కల్లంలో కుప్పలు వేసిన గడ్డి వాములు మంగళవారం అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆ గ్రామంలోని సుదర్శన మహంకుడొ కల్లంలో గడ్డి వాములు కుప్పలుగా వేశాడు. అకస్మాత్తుగా గడ్డి కుప్పలకు మంట అంటుకోవడంతో ఆయన అగ్నిమాపక అధికారులకు తెలియ జేశారు. అగ్నిమాపక సిబ్బంది వాహనంతో చేరేసరికి మొత్తం గడ్డి కుప్పలన్నీ కాలి బూడిదయ్యాయి. తన ఇంటి పాడి పశువుల మేత కోసం 10 ఎకరాలలో పండించిన వరిపంట గడ్డిని కల్లంలో కుప్పలు వేసి ఉంచాడు. మొత్తం కాలిపోయింది.

భారత విద్యా విధానంలో మార్పులు

- జాతీయ సెమినార్‌లో బరంపురం విశ్వవిద్యాలయం ప్రాంతీయ సంచాలకులు, డాక్టర్ సిద్ధార్థ శంకర్ పాఢి
- శ్రీకృష్ణచంద్రగజపతి కళాశాలలో మూడు రోజుల జాతీయ సెమినార్



జాతీయ సెమినార్‌లో భారతీయ జ్ఞాన పరంపరపై సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

పర్లాకిమిడి: వికసిత్ భారత్-2047 లక్ష్యంగా నూతన విద్యా విధానం, కృత్రిమ మేధ, ఈ-స్మార్ట్ క్లాసులు, ఈ-లైబ్రరీలు, కొత్త పాఠ్యపుస్తకాలతో విద్యా విధానం మారబోతోందని బరంపురం విశ్వవిద్యాలయం ప్రాంతీయ సంచాలకులు (ఎడ్యుకేషన్), ఉత్కళ సమాజ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ సిద్ధార్థ్ శంకర్ పాఢి అన్నారు. ఆయన స్థానిక కృష్ణచంద్ర గజపతి (స్వయంప్రతిపత్తి) కళాశాలలో 'భారతీయ జ్ఞాన పరంపర' అనే మూడు రోజుల జాతీయ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత బరంపురం విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గీతాంజలి దాస్ అతిథిని పరిచయం చేయగా, ముఖ్యవక్తగా సెంచూరియన్ వర్సిటీ అసోసియేట్ డీన్, ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞాపాణి, మరో వక్త బరంపురం వర్సిటీ ప్రాంతీయ ఉన్నత విద్య సంచాలకులు, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ సుశాంత దాస్, కాన్ఫరెన్స్ కన్వీనరు రాధాకాంత భుయ్యాన్ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జితేంద్రనాథ్ పట్నాయిక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధార్థ శంకర్ పాఢి మాట్లాడుతూ, 2047 కల్లా దేశంలో ఇండియన్ ఎడ్యుకేషన్ సిస్టం మారబోతోందని స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారని, భారతీయ జ్ఞాన సంపద ఎంతో గొప్పదని, ఎన్నో ఏళ్ల కిందటే మనవాళ్ళు సైన్స్, ఖగోళం, మాథ్స్‌లో అనేక విజయాలు సాధించి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించారని అన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకులు ప్రజ్ఞాపాణి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో నూతన విద్యావిధానం, భారతీయ జ్ఞాన పరంపరపై వివరించారు. రాష్ట్రంలో గుణుపురం, రాయగడ, గజపతి, గంజాం జిల్లాల నుంచి అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు సెమినార్‌లో పాల్గొన్నారు. అనంతరం భారతీయ జ్ఞాన పరంపరపై ఒక సావనీర్‌ను జాతీయ సెమినార్‌లో అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యఅతిథులు డాక్టర్ సిద్ధార్థ శంకర పాఢి (బరంపురం వర్సిటీ), డాక్టర్ సుశాంత దాస్‌లకు జ్ఞాపికలు, శ్వేత వస్త్రంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఎస్.పట్నాయిక్ సత్కరించారు.



జాతీయ సెమినార్‌కు విచ్చేసిన వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు

కుంభార సాహిలో ముగిసిన అష్టప్రహరీ నామయజ్ఞం



కుంభార సాహిలో అష్టపహరీ భజన సంకీర్తనల్లో భక్తులు

జయపురం: జయపురం కుంభార సాహిలో శ్రీనిత్యానంద మహాప్రభు జన్మదినం సందర్భంగా మంగళవారం అష్ట ప్రహరీ నామయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంకీర్తన బృందాలు పాల్గొన్నాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో వందలాది మందికి అన్నసంతర్పణ చేశారు. అష్టపహరీ నామయజ్ఞం సందర్భంగా మహిళలు జలాశయానికి వెళ్లి పవిత్ర జలాలను తీసుకువచ్చారు. సాయంత్రం దేవతా పూజలు నిర్వహించారు. అనంతరం అష్ట ప్రహరీ నామయజ్ఞం, భజన సంకీర్తన నిర్వహించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గణేశ్వర్

రాయగడ: ఐటీ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో సైబర్ మోసగాళ్లు కూడా రెచ్చిపోతున్నారు. వారి నుంచి ఎలా కాపాడుకోవాలో అందరూ అవగాహన పెంచుకోవాలని ఐటీ విభాగం చీఫ్ డైరెక్టర్ ఎస్.గణేశ్వర్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని సమావేశ హాల్‌లో మంగళవారం సేఫర్ ఇంటర్‌నెట్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఎక్కువగా మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ఇంటర్‌నెట్ వినియోగంపై కూడా సరైన అవగాహన కలిగి ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు వసూలుకు వెళ్లిన ఉద్యోగులపై దాడి



విద్యుత్ ఉద్యోగులతో గొడవ జరుగుతున్న దృశ్యం

మల్కన్‌గిరి: బకాయిపడిన విద్యుత్ బిల్లు వసూలు చేయడానికి వెళ్లి సిబ్బందిపై ఓ రైతు దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధిలోని ఎంపీవీ-42 గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎంపీవీ-42 గ్రామానికి చెందిన రైతు ప్రకాష్ బిశ్వాస్ తన పొలానికి సాగు నీటి కోసం విద్యుత్ కనెక్షన్‌ను తీసుకున్నాడు. అయితే కొన్నినెలలుగా బిల్లు చెల్లించడం లేదు. దీంతో టాటా పవార్ కంపెనీ సిబ్బంది ప్రకాష్‌ను మంగళవారం కలిసి బిల్లు విషయమై మాట్లాడుతున్నారు. ఇంతలో ప్రకాష్ బిశ్వాస్ సహనం కోల్పోయి ఉద్యోగులపై చేయి చేసుకోవడం తోపాటు కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించాడు. అక్కడే ఉన్న కొంతమంది గ్రామస్తులు జోక్యం చేసుకొని ఉద్యోగులను అక్కడనుంచి పంపించేశారు. ఆ తరువాత ఉద్యోగులు మోటు పోలీసుస్టేషన్‌లో దాడికి పాల్పడిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోద్ చేసిన పోలీసులు ప్రకాష్ బిశ్వాస్ కోసం గాలిస్తున్నారు.

రహదారులు, వంతెనలు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం



శబరి నది ఘాట్ వద్ద కొత్త పడవ ప్రారంభించిన ఎమ్మెల్యే తదితరులు



కొత్త పడవలో ప్రయాణికులతో ఎమ్మెల్యే తదితరులు

జయపురం: అనేక గ్రామాలకు రహదారి సౌకర్యాలు, నదులపై వంతెనలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం గుర్తించిందని కొట్‌పాడ్ బీజేపీ ఎమ్మెల్యే రూపు భొత్ర తెలిపారు. తన నియోజకవర్గం బొయిపరిగుడ సమితి తెంతులిగుమ్మ గ్రామ పంచాయతీలో శబరి నది పితా ఘాట్ వద్ద మంగళవారం కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర కొత్త పడవను ప్రారంభించారు. ప్రయాణికులతో ఆవల ఒడ్డుకు ప్రయాణించారు. నదికి ఆవల ఉన్న భెజినిగుడ, మచ్చగుడ, మట్టిగుడ తదితర గ్రామాల ప్రజలు నది దాటి రావాలంటే పాడైన పడవపైనే ఆధార పడుతున్నారని, అందుకే కొత్త పడవను ఏర్పాటు చేశామని తెలిపారు. వంతెన నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారని, అందుకు కృషి చేస్తానన్నారు. పడవ ప్రారంభోత్సవంలో బొయిపరిగుడ తహసీల్దార్ స్నిగ్ధరాణి చౌదరి, తహసీల్దార్ అభిమణ్యు కవిశతపతి, నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి రామేశ్వర జెన, తెంతులిగుమ్మ సర్పంచ్ మన్మతీ నాయిక్, సమితి సభ్యులు శశి పూజారి, భెజినిగుడ వార్డు సభ్యుడు కాశీనాథ్ చలాన, పీఈఓ గౌరికృష్ణ పంగి, సమితి ఇంజినీర్, జూనియర్ ఇంజనీర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

శ్రామిక చైతన్య రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహారో తదితరులు

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శ్రామికుల సంక్షేమం కోసం అమలు చేసే పథకాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన శ్రామిక చైతన్య రథాన్ని మంగళవారం ప్రారంభమైంది.

దీన్ని జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహారో ముఖ్యఅతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. రాయగడ జిల్లాలోని 11 సమితుల్లో ఈ రథం ద్వారా సిబ్బంది పర్యటించి శ్రామిక పథకాలపై ప్రజల్లో చైతన్యం పరుస్తతుర. ప్రారంభ కార్యక్రమంలో శ్రామిక విభాగం అధికారి సుభాష్ మండల్, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్ర తిన్న విద్యార్థినికి అస్వస్థత

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి ఎంపీవీ 9 గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నులిపురుగుల మాత్రలు అందజేశారు. అయితే మాత్ర తిన్న కాసేపటికి 6వ తరగతి విద్యార్థిని డోలీ రాయ్ అస్వస్థతకు గురైంది.

పాఠశాల ఉపాధ్యాయులు ఏ చర్య తీసుకోలేదు. ఇంటికి వచ్చాక తల్లిదండ్రులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై విచారణ జరపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇటలీ దంపతులకు బాలుడి దత్తత



కలెక్టర్ కార్యాలయంలో బాలుడిని దత్తతగా స్వీకరిస్తున్న ఇటలీ దేశ దంపతులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా నుంచి మరో బాలుడిని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తన కార్యాలయంలో ఇటలీ దేశం దంపతులు మంగళవారం అధికారికంగా దత్తత ఇచ్చారు. తల్లిదండ్రులు లేని వారిని జిల్లా అధికారులు చేరదీసి జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో ఉన్న సలోం శిశు సంరక్షణ కేంద్రంలో పెంచుతారు. ఇక్కడ పదకొండేళ్ల బాలుడిని అన్ని శారీరక పరీక్షలు చేశాక ఇటలీ దేశానికి చెందిన దంపతులు సంతోషంగా దత్తత తీసుకున్నారు. సంతానం లేని ఇటలీ దేశ దంపతులు కేంద్ర దత్తత పోర్టల్‌లో మూడేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం అధికారికంగా కలెక్టరేట్‌లో వారికి ఆ బాలుడిని అప్పగించారు. అప్పగింత కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ సమితి చైర్మన్ అశ్వినీ కుమార్ మహాపాత్రో, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, దత్తత కేంద్రం పర్యవేక్షకులు శుభాంకర్ లిమ్మా తదితరులు పాల్గొన్నారు.

'నాల్కో' ప్రభావిత ప్రాంతంలో లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పర్యటన



గ్రామస్తులతో కలిసి క్షేత్ర పర్యటన చేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత



రెడ్ మడ్ పాండ్



వ్యర్థాలతో నిండిన ప్రాంతం

కొరాపుట్: భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) పరిశ్రమ వ్యర్థాల ప్రభావిత ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత మంగళవారం పర్యటించారు. కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి ముజంగా గ్రామ పంచాయతీ డెంగా జానీ గుడ గ్రామస్తులతో ఈ సందర్భంగా సమావేశమయ్యారు. నాల్కో వ్యర్థాలతో ఏర్పాటు చేసిన రెడ్ మడ్ పాండ్‌ను స్థానికులు ఎమ్మెల్యేకు చూపించారు. ముడి బాక్సైట్ శుద్ధి అనంతరం విడుదలైన నీటిలో రెడ్ మడ్ పాండ్ ఏర్పడుతుందన్నారు. ఇటువంటి వ్యర్థాల నిల్వ కేంద్రం జన వాసాలకు దూరం ఉండాలని కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయన్నారు. కానీ గ్రామ సభ అనుమతి లేకుండా తమ గ్రామ సమీపంలో దీనిని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యేకు చెప్పుకున్నారు. దీంతో గ్రామంలో నివసిస్తున్న గిరిజనుల ఆరోగ్యం, వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాము ఎన్నిసార్లు నాల్కో అధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని ఎమ్మెల్యేకి వివరించారు. ఎమ్మెల్యే గిరిజనులతో కలసి ఆ ప్రాంతంలో కాలి నడకన సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. ఈ సమస్యపై తాను అనేకసార్లు అసెంబ్లీలో లేవనెత్తినప్పటికీ నాల్కోలో చలనం లేదన్నారు. తక్షణం అక్కడ గ్రామస్తులకు వేరే చోట నిర్వాసితుల హక్కులతో కూడిన ప్రత్యేక గ్రామం ఏర్పాటు చేసి తరలించాలన్నారు. వారి డిమాండ్లు పూర్తి చేయాలన్నారు. లేకపోతే ఈ సమస్యపై ప్రజాపోరాటం తప్పదన్నారు. ఇక్కడ గనులు తవ్వుకొని గిరిజనులకు జీవనం లేకుండా చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధదనలకు వ్యతిరేకంగా ఇక్కడ వ్యవహారాలు జరుగుతున్నాయని పవిత్ర శాంత ఆగ్రహం వ్యక్తం చేశారు.

కరాటేలో అంతర్జాతీయ గుర్తింపు



భానుచందర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న రమేష్

రాయగడ: కరాటేలో స్థానికుడైన ఎల్.రమేష్ కుమార్ అంతర్జాతీయ స్థాయి అవార్డును దక్కించుకున్నాడు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ -25 పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. న్యూ డ్రాగన్ ఫైటర్స్, మార్షల్ ఆర్ట్స్ సంఘం హైదరాబాద్‌లో గల ఎల్‌బీ నగర్‌లో ఫిబ్రవరి 9న నిర్వహించిన 4 వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతి సాధించాడు. ఈ అవార్డును ప్రముఖ సినీ నటుడు భానుచందర్ చేతుల మీదుగా అందుకున్నాడు.

ఘనంగా సమర యోధుడు బగ్గో పుజారి వర్ధంతి



బగ్గో పూజారి స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొరాపుట్: స్వాతంత్ర్య సమర యోధుడు దివంగత బగ్గో పూజారి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ పట్టణానికి సమీపంలో బొడ బరండి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బగ్గో పూజారి కుమార్తె.. మాజీ మంత్రి పరమ పూజారి నేతృత్వంలో ర్యాలీ చేశారు. ప్రముఖులు అతని స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. సాయుధ పోలీసులు తుపాకులతో గౌరవ వందనం సమర్పించారు. మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి, జొరిగాం ఎంఎల్ఏ నర్సింగ్ బోత్ర, మాజీ ఎంపీ భగవాన్ మజ్జి, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాల సంఘం అధ్యక్షుడు మున్నా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘటనా స్థలం పరిశీలన



రత్నాలు మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

సోంపేట: మండలంలోని జింకిభద్ర బీసీ కాలనీలో సోమవారం రాత్రి సాహుకారి రత్నాలు(70)ను ఆమె భర్త డిల్లేశ్వరరావు మద్యం మత్తులో గొడ్డలితో నరికి హత్య చేసిన విషయం తెలిసిందే. దీంతో ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకట అప్పారావు స్థానిక ఎస్ఐ లవరాజుతో కలిసి మంగళవారం పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్పెంటర్ షెడ్ దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

బూర్జ: మండలంలోని బూర్జ గ్రామంలో సింహాద్రి శ్రీనివాసరావుకు చెందిన కార్పెంటర్ షెడ్ దగ్ధమైంది. షెడ్‌లో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించడంతో ఫర్నీచర్, మిషన్లు కాలిపోయినట్లు మంగళవారం ఆయన తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికే ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జాతీయ కబడ్డీ పోటీలకు హసీనా ఎంపిక



షేక్ హసీనా

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి మహిళల కబడ్డీ ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు జిల్లా నుంచి యువ క్రీడాకారిణి షేక్ హసీనా ఎంపికైంది. ఈ పోటీలు హర్యానా రాష్ట్రంలోని పానిపట్టు వేదికగా ఈనెల 14 నుంచి 16 వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టుకు హసీనా ప్రాతినిధ్యం వహించనుంది. ఇటీవలి జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగ్గా రాణించడంతో ఈ ప్రతిష్టాత్మక పోటీలకు ఎంపికైంది. ఎచ్చెర్ల మండల పరిధిలోని తోటపాలెం గ్రామానికి చెందిన షేక్ హసీనా తండ్రి భవన నిర్మాణ కార్మికుడు. ప్రస్తుతం ఈమె పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్ పూర్తి చేసుకుని మెయిన్స్‌కు సన్నద్ధమవుతోంది. ఫిజికల్ ఎడ్యుకేషన్ డీపీఈడీ పూర్తి చేసుకుంది. హసీనా జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై శ్రీకాకుళం జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సాదు ముసలినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాధు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, తవిటమ్మ, నారాయణరావు, కోశాధికారి నాగళ్ల రమేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సెక్రటరీగా పోలినాయుడు



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల జువాలజీ సీనియర్ లెక్చరర్‌గా, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కెప్టెన్ డాక్టర్ యళ్ల పోలినాయుడు గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ (జీసీటీఏ) రాష్ట్రస్థాయి కార్యాలయ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఈ మేరకు గుంటూరులో మంగళవారం జరిగిన ఆ సంఘ కార్యవర్గ సమావేశంలో డాక్టర్ పోలినాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జీసీటీఏ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.చక్రపతి తెలిపారు. ఈయన ఎన్నికపై శ్రీకాకుళం గవర్నమెంట్ పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.సురేఖ, రాష్ట్ర అకడమిక్ సెక్రటరీ డాక్టర్ డి.పైడితల్లి, జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్.రామకృష్ణ, జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ఢిల్లేశ్వర్‌రావు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పోలినాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో సురక్షిత అంతర్జాల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టులు, వ్యక్తిత్వ హననం వంటి నేరాల వల్ల కలిగే శారీరక, మానసిక ఇబ్బందులను నివారించడానికి అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదని, అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకూడదని, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఐసీ అధికారి కె.కిరణ్ కుమార్ సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సమాచార ఎన్ఐసీ అధికారి విజయ్‌బాబు, నెట్‌వర్క్ ఇంజినీర్ శ్రీరామ్ ప్రకాష్, ఈ-ఆఫీస్ టెక్నికల్ అసోసియేట్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్ల పండగ



అమ్మవారికి మేకపోతును చూపిస్తున్న రజకులు



బల్లపండుగలో పాల్గొన్న రజకులు



బల్లకు పూజలు చేస్తున్న రజకులు

పర్లాకిమిడి: మకర సంక్రాంతి అనంతరం రజకులు తమ వృత్తికి కొన్ని రోజులు విరామం పాటిస్తారు. అనంతరం మాఘ మాసంలో వచ్చే బల్ల పండగ ఘనంగా ఈ ప్రాంతంలో నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా పర్లాకిమిడి 14వ వార్డు చాకలివీధిలో రజకులు బల్ల పండుగ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ పండగకు ముఖ్య అతిథిగా పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి విచ్చేశారు. రాయిచెట్టు జంక్షన్ వద్ద చెవిటమ్మ మందిరానికి ఉదయం ముగ్రాటలు, గజనెయ్యిముద్దను తమ కులదేవత చెవిటమ్మ కోవెల వద్ద ఉంచి బల్ల(రాయికి)కు పూజలు చేశారు. రజకులు బల్లను ఆరాధ్యదైవంగా భావిస్తారు. పండగ పూర్తయిన తరువాత అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించి మరుచటిరోజు తిరిగి తమ వృత్తిని కొనసాగిస్తారు. ప్రతి ఏటా ఈ ప్రాంతంలో రజకులు బల్ల పండుగ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్టు రజక సంఘం సభ్యులు తెలియజేశారు.

భక్తులకు ఇబ్బంది కలగకూడదు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని మహేంద్రగిరి పర్వతంపై శైవ మందిరం వద్ద మహా శివరాత్రి వేడుకలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం సన్నాహక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ నెల 25, 26వ తేదీల్లో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈ సమావేశానికి ఏ.డి.యం. రాజేంద్రమింజ్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, సబ్ డివిజనల్ అధికారి మాధవానంద నాయక్, రాయఘడ తహసీల్దార్ సుకాంత ప్రదాన్, తదితరులు హాజరయ్యారు. మహేంద్రగిరి బుర్‌ఖాత్ పాస్ వద్ద తాగునీరు, విద్యుత్ దీపాలు, కుంతి, యుధిస్టర మందిరం, తదితర చోట్ల పోలీసు సిబ్బంది మోహరింపు చేయాలని నిర్ణయించారు.రోడ్లు మరమ్మతులు చేయాలని రూరల్ వర్క్స్ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. యాత్రికులు రాత్రి పూట బస చేయడానికి షామియానాలు, పది రూపాయలకే ఆహార పొట్లాలు అందించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

డబ్బులు తీసుకున్నారు.. టికెట్లు ఇవ్వలేదు

జయపురం: ఓఎస్ఆర్‌టీసీ బస్సుల్లో ఇద్దరు కండక్టర్లు ప్రయాణికుల నుంచి డబ్బులు తీసుకుని టికెట్లు కోయకుండా పట్టుబడిన సంగతి ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ నెల 8వ తేదీ నాడు జయపురం నుంచి కాశీపూర్ ఆర్‌టిసి బస్సులో 41 మంది ప్రయాణికుల వద్ద టికెట్లు లేవని ఆర్‌టిసి స్క్వాడ్ రైడ్‌లో వెల్లడైంది. ప్రయాణికులు టికెట్ డబ్బు ఇచ్చినా కూడా కండక్టర్ టికెట్లు ఇవ్వలేదని తెలిపారు. అలాగే విశాఖపట్నం-జయపురం బస్సులో 8వ తేదీ నాడు అలాంటి సంఘటనే చోటు చేసుకుంది. ఆ బస్సులో 19 మంది ప్రయాణికులకు టిక్కెట్లు లేవని ఆర్టీసీ స్క్వాడ్ రైడ్ అధికారుల తనిఖీలో తేలింది. మొత్తం రెండు బస్సుల్లో 60 మంది ప్రయాణికులకు కండక్టర్లు టికెట్లు ఇవ్వలేదని సమాచారం. దీనిపై ఓఎస్ఆర్‌టిసి అధికారులు ఇద్దరు కండక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బక్షీపాత్రోకు ఘనంగా నివాళులు



బక్షీపాత్రో విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

రాయగడ: రాయగడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కృష్ణచంద్ర బక్షీపాత్రో 15వ వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యావేత్త డాక్టర్ డి.కె.మహంతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిరంజన్ బక్షీపాత్రో, ఖాదర్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, తదితర ప్రముఖులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. పట్టణాభివృద్ధికి బక్షీపాత్రో చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

సురక్షిత ఇంటర్నెట్‌పై అవగాహన



సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు, అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ హాజరై ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా ఇ-గవర్నెన్స్ డైరెక్టర్ శుభాశిష్ పట్నాయిక్, డీఐఓ (ఎన్ఐసి) నజనీష్‌కాంత్ పాండే కార్యక్రమాన్ని నడిపించారు.

కూర్మనాథుని సన్నిధిలో కనుమూరి



గార: శ్రీకూర్మనాథాలయంలో బాపిరాజు దంపతులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మం శ్రీకూర్మనాథున్ని మాజీమంత్రి, తిరుమల తిరుపతి దేవస్థానముల మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు సతీసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు క్షేత్ర మహత్యాన్ని తెలియజేశారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, అంధవరపు సూరిబాబు తదితరులు ఉన్నారు.

ఘంటసాలకు ఘనంగా నివాళి



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

పర్లాకిమిడి: తెలుగు చలనచిత్ర సీమలో అత్యధిక ప్రజాదరణ, ప్రపంచఖ్యాతిని గడించిన స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు ఒక్కతెలుగులో 45 వేల పాటలు, పద్యాలు పాడారని చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి కార్యదర్శి బర్నాల జనార్ధన రావు అన్నారు. ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని పాతపట్నం రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పారిశెల్లి రామరాజు మాస్టారు, ఇతర అభిమానులు మంగళవారం పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి సభలో చైతన్య సమితి అధ్యక్షులు కె.ఆనందరావు, ఇసై వెంకట్రావు, ఉపాధ్యాయిని సి.హెచ్.గీతాంజలి, యస్.ఎన్.పండా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఘంటసాల పాడిన కొన్ని మధురమైన పాటలను ఇసై వెంకట్రావు ఆలపించారు.

ఇంటిని ఢీకొన్న బీఎండబ్ల్యూ కారు



కారు ఢీకొనడంతో బీటలు వారిన ఇంటి గోడ.



ఇంటిని ఢీకొన్న దృశ్యం.

భువనేశ్వర్: అతివేగంతో దూసుకువచ్చిన బీఎండబ్ల్యూ కారు ఇంటిలోకి దూసుకెళ్లింది. స్థానిక యూనిట్ 4 ఆస్పత్రి వీధిలో మంగళవారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. రెడ్ క్రాస్ భవనం ప్రాంతంలో నడి రోడ్డు మీద బారికేడు అతిక్రమించి ఇంటి వైపు దూసుకు పోవడంతో ప్రమాదం సంభవించింది. దీంతో ఇంటి గోడ, ప్రహరీ బీటలు వారాయి. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులను స్థానికులు కారులో గుర్తించారు.



ప్రమాదంతో నుజ్జు అయిన కారు.



రోడ్డు మీద బారికేడు అతిక్రమించి ఇంటిని ఢీకొన్న కారు

అంతర్రాష్ట్ర నాటక పోటీల విజేతగా ఇంద్రప్రస్థం



మొదటి బహుమతి అందుకుంటున్న ఇంద్రప్రస్థం నాటిక పాత్రధారి రవీంద్రరెడ్డి

కవిటి: మండలంలోని బొరివంకలో కళింగ సీమ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బల్లెడ అనసూయమ్మ ఆహ్వానిత అంతర్రాష్ట్ర నాటిక పరిషత్ పోటీలు సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా గుంటూరు జిల్లా అభినయ ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక నిలిచింది. ద్వితీయ స్థానంలో తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత, జ్యూరీ విభాగంలో అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురుమేఘం తృతీయ స్థానంలో నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో ఉత్తమ నటుడిగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలోని పీవీ వరప్రసాద్, ఉత్తమ నటిగా జనరల్ బోగీలు నాటికలో సురభి ప్రభావతి, ఉత్తమ విలన్‌గా నిశ్శబ్దమా నీ ఖరీదెంత డి.హేమ, ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఇంద్రప్రస్థం నాటికలో ఎన్.రవీంద్ర రెడ్డి, ఉత్తమ రచనగా జనరల్ బోగీలు నాటిక పీటీ మాధవ్, ఉత్తమ దర్శకత్వం ఇంద్రప్రస్థం దర్శకుడు ఎన్.రవీంద్రారెడ్డి, ఉత్తమ సంగీతం విభాగంలో ఇంద్రప్రస్థం నాటిక పి.లీలామోహన్, ఉత్తమ ఆహార్యం నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికకు ఎస్.రమణ, ఉత్తమ రంగాలంకరణలో ఇంద్రప్రస్థం నాటికకు ఎం.భీమకుమార్ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు కళింగసీమ కళాపీఠం అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి, విశ్రాంత డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు, డాక్టర్ పి.శివాజీ, డా.వై కృష్ణమూర్తి, పి.కృష్ణారావు, డి.రాజు, ఎం.రామారావు, ఎస్‌పీ రమణ, బి.చిన్నబాబు, బి.శ్రీరాంప్రసాద్, బి.విజయకృష్ణ, డి.సతీష్ తదితరులు బహుమతులు అందించారు.

ఓపీసీసీ అధ్యక్షుడిగా భక్త చరణ్ దాస్



భక్త చరణ్ దాస్

భువనేశ్వర్: ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా సీనియర్ నాయకుడు భక్త చరణ్ దాస్ నియమితులయ్యారు. నియామకం తక్షణమే అమలు అవుతుందని అఖిల భారత కాంగ్రెసు కమిటీ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంస్థాగత చర్యల్లో భాగంగా ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో పార్టీ తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నందున ఈ పునర్వ్యవస్థీకరణ కీలకమైనదిగా కాంగ్రెసు శిబిరంలో చర్చ ఊపందుకుంది.

భక్త చరణ్ దాస్ అనుభవజ్ఞుడైన నాయకునిగా సుపరిచితులు. ఇటీవల కాలంలో కాంగ్రెస్ గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటూ అనేక ఒడిదొడుకులతో తల్లడిల్లుతున్న తరుణంలో పార్టీ నాయకత్వాన్ని పునరుజ్జీవింపజేసే దిశగా ఈ నియామకం భారీ మార్పును ఆవిష్కరిస్తుందని భావిస్తున్నారు. భక్త చరణ్ దాస్ ఒడిశా రాజకీయ రంగానికి కొత్తేమీ కాదు. ఆయన దశాబ్దాలుగా రాష్ట్రంలో ప్రభావవంతమైన నాయకుడిగా పేరొందారు. కలహండి నియోజక వర్గం నుంచి అనేక పర్యాయాలు పార్లమెంటు సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించారు. తన రాజకీయ ప్రస్థానంలో గిరిజన వర్గాలు, రైతులు, అణగారిన వర్గాలకు బలమైన వారధిగా ప్రాతినిధ్యం వహించిన నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాలో పార్టీ ప్రచార కమిటీ అధిపతిగా భక్త చరణ్ దాస్ సారథ్యం వహించారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరాజయాన్ని చవి చూసింది. ఈ పరిస్థితుల దృష్ట్యా నైతిక బాధ్యత వహిస్తూ జూన్ 11, 2024న ప్రచార కమిటీ అధిపతి పదవికి రాజీనామా చేశారు. ఆయన నాయకత్వ లక్షణాలకు పట్టం గడుతు అధిష్టానం మరోమారు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షునిగా పట్టం గట్టడం విశేషం.

బెనాగాం సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం



సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన సర్పంచ్, వార్డు మెంబర్లు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి బెనాగాం సర్పంచ్ మనోధర నాయక్‌పై అవిశ్వాస ప్రతిపాదన తీసుకువచ్చారు. గ్రామ పంచాయతీలో నాయక్ సర్పంచ్‌తోపాటు ఎనిమిది మంది వార్డు మెంబర్లున్నారు. మంగళవారం జయపురం సబ్‌కలెక్టర్ ఎ.శౌర్య రెడ్డిని కలిసి సర్పంచ్‌పై పలు ఆరోపణలతో కూడిన ఫిర్యాదును అందించారు. సర్పంచ్ అభివృద్ధి పనులకు సహకరించటం లేదన్నారు. పంచాయతీ ప్రజలను మౌలిక సౌకర్యాలకు దూరం చేస్తున్నారని, తాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారన్నారు. రోడ్లు నరక కూపాలుగా ఉన్నా మరమ్మతులు చేయటం లేదన్నారు. వైద్య సౌకర్యాలకు ప్రజలు నోచుకోవటం లేదని ఆరోపించారు. పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు అవుతున్నా ఖర్చు కావటంలేదన్నారు. ఇందుకు ప్రధాన కారణం సర్పంచ్ అన్నారు. సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకురావాలని జనవరి 4వ తేదీన వార్డు సభ్యులందరూ సమావేశమై తీర్మానించామని వెల్లడించారు. పంచాయతీ నియమాల ప్రకారం సర్పంచ్‌ను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయిక్ సర్పంచ్ భగవతీ పెంటియ నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. వార్డు మెంబర్లు జగన్నాథ్ పెంటియ, హీరామణి పెంటియ, ఘాశీరాం హరిజన్, రాజనిక హరిజన్, సబిత కుంజలత గోండ్, లలిత రొంధారి, రజక్ మహురియ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు

రాయగడ: స్థానిక గాయత్రీనగర్‌లో గల సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. రానున్న మూడేళ్ల కోసం ఏర్పాటైన ఈ సంఘానికి బినోద్ చంద్ర పండను మరోసారి అధ్యక్షుడిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉదయ చంద్ర పండా, ఉపాధ్యక్షులుగా సుభాష్ చంద్ర రథ్, చంద్ర శేఖర్ పాత్రో, వైకంటరావు, సాధారణ కార్యదర్శిగా ద్వారికా నాథ దాస్, సహ కార్యదర్శులుగా బలరాం చౌదరి, బి.చంద్ర శేఖర్ పాత్రో, కార్యదర్శి (ఫైనాన్స్) బి.ఎస్.థప, సహ కార్యదర్శి (ఫైనాన్స్) గోపాల కృష్ణపాల్ నియమితులయ్యారు.

ఈ సందర్భంగా కార్యవర్గం సభ్యులు సీనియర్ సిటిజన్ల హక్కులకు సంబంధించి ప్లకార్డులు పట్టుకుని పట్టంలో ర్యాలీ నిర్వహించారు.

గుప్పుమన్న గంజాయి

● ఎమ్మెల్యేకే పట్టుబడిన యువకులు



ఎమ్మెల్యే సమక్షంలో యువకులను ప్రశ్నిస్తున్న ఒకటో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నదానికి నిలువెత్తు నిదర్శనం మంగళవారం జరిగిన ఘటన. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో.. నగరం నడిబొడ్డున.. నిత్యం జనరద్దీ ఉన్న పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ ప్రాంతంలో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం మధ్యాహ్నం మార్కెట్‌ను సందర్శించేందుకు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ వెళ్లారు. దీనిలో భాగంగా మార్కెట్‌లో దుకాణాలు, ఖాళీగా ఉన్న బ్లాకుల్లోని గదులను పరిశీలించగా, అక్కడ ఆయనకు వింత పరిస్థితి ఎదురైంది. ముందుగా ఒక రూమ్‌లో మద్యం సేవిస్తూ కొంతమంది తారసపడ్డారు. అనంతరం మెట్లెక్కి మీదకు వెళ్దామనుకునేలోగా అదే మెట్లపై ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తూ కనిపించడంతో అవాక్కయ్యారు. దీంతో వెంటనే ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణకు ఫోన్‌లో సమాచారం అందించారు. తదుపరి శ్లాబ్ మీదకు వెళ్లి పరిశీలించగా మద్యం బాటిళ్లు దర్శనమిచ్చాయి. ఈలోగా ఏఎస్ఐ, ఇతర పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని ఎమ్మెల్యే సమక్షంలోనే యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బజారులో ఇలాంటి కార్యకలాపాలు జరగడం అత్యంత దారుణమన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా యువతలో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని సీఐ సీహెచ్ పైడపునాయుడు వద్ద ప్రస్తావించగా దమ్మలవీధి, గోల్కొండ రేవుకు చెందిన ఇద్దరు యువకులు ఒక గ్రాముకు పైగా గంజాయి సేవిస్తుండగా పట్టుకున్నామని, వారు ఒక సాధువు దగ్గర కొన్నామని తెలిపారన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపడతామని పేర్కొన్నారు.

తగ్గేదే లే..!

● ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య పోరు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోషల్ వర్కు విభాగానికి సంబంధించిన ఇద్దరు రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. దీంతో ఉన్నతాధికారుల సమక్షంలో మంగళవారం పంచాయితీ జరిగింది. అయితే అధికారుల సమక్షంలో సైతం వీరిమధ్య ఆధిపత్య పోరు కొనసాగింది. డిపార్టమెంట్ మూసేస్తామంటూ అధికారులు తీవ్రంగా హెచ్చరించినా.. మూసుకోండి అంటూ ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ సమాధానం ఇవ్వడం గమనార్హం. గతనెల 31వ తేదీన ఇద్దరు రీసెర్చ్ స్కాలర్లకు ప్రీ టాక్ నిర్వహించారు. ఇదే సమయంలో తన రీసెర్చ్ స్కాలర్‌కు వైవా నిర్వహించాలని ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ కోరారు. అయితే మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ (విభాగాధిపతి) తనకు ఫైల్ సిద్ధం చేసేందుకు సమయం కావాలని, ఫిబ్రవరి 19న వైవా నిర్వహణకు ఫైల్ సిద్ధం చేస్తానని చెప్పారు. దీంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సదరు అసిస్టెంట్ ప్రొఫెసర్ తీసుకెళ్లారు.

అప్పటినుంచి వీరిని అధికారులు అనేకసార్లు పంచాయితీకి పిలిచినా కుదరలేదు. చివరికి మంగళవారం వీరి మధ్య మీటింగ్ నిర్వహించగా.. అధికారుల ముందే వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం సోషల్‌వర్కు విభాగంలో మొదటి ఏడా దిలో 40 సీట్లుకు 17 మంది, రెండో ఏడాదిలో 40 సీట్లుకు ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ప్రొఫెసర్ల విభేదాలు వర్సిటీలో చర్చనీయాంశంగా మారాయి.

క్లుప్తంగా

బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిల్స్‌ను చూపిస్తున్న సీఐ తదితరులు

రాజాం సిటీ: రాజాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ ఆర్.జై భీమ్ మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులు పట్టుబడగా కేసులు నమోదుచేశామని చెప్పారు. వారిలో రాజాం మండలానికి చెందిన ఎం.మురళి, జి.రాణి, సంతకవిటి మండలానికి చెందిన కె.హేమశంకరరావు, వంగర మండలానికి చెందిన జి.శ్రీనులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 52 మద్యంబాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మినా, బెల్టుషాపులు నిర్వహించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించిన వారి వివరాలు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం కూడలిలో పోతేన శంకరరావుకు చెందిన లక్ష్మీ ట్రేడర్స్ (స్క్రాప్) దుకాణంలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. సమీపంలో పాత కాగితాలు, అట్టలు దగ్ధం చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ క్రయంలో దుకాణంలో ఉన్న వ్యర్థాలు, స్క్రాప్ మెటీరియల్‌కు మంటలు వ్యాపించడం, దట్టమైన పొగ కమ్ముకోవడంతో అక్కడి వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది, శకటంతో సహా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బాధితుడి నుంచి సేకరించిన సమాచారంతో నష్టం అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పెదతాడివాడ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని తిప్పాన విద్యశ్రీకి ప్రశంసాపత్రాన్ని అందించి అభినందిస్తున్న డీఈవో మాణిక్యం నాయుడు తదితరులు

డెంకాడ: ఎడ్యుకేషన్ ఎఫిషియన్సీ మెరిట్ టెస్ట్(ఈఈఎంటీ-2025)లో పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తిప్పాన విద్యశ్రీ ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ పోటీలో పెదతాడివాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తిప్పాన విద్యశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకును సాధించింది. దీంతో ఇటీవల అమరావతిలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని తిప్పాన విద్యశ్రీకి స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి.విజయరామరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యంనాయుడు, ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ, ఈఈఎంటీ జిల్లా కో ఆర్డినేటర్ వి.రాజేష్‌లు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీఏ నరసింగరావు, ఉపాధ్యాయిని జి.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రథంపై రామయ్య..!

- రామతీర్థంలో వైభవంగా సాగిన రథయాత్ర
- స్వామిసన్నిధిలో ఆకట్టుకున్న పండిత పరిషత్
- కనులారా తిలకించిన భక్తజనం



జై శ్రీరామ్ అంటూ రామస్వామి ఆసీనులైన రథాన్ని లాగుతున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం రామనామస్మరణతో మంగళవారం మార్మోగింది. ప్రతి ఏటా స్వామివారి తిరుకల్యాణం అనంతరం మూడోరోజు నిర్వహిస్తున్న స్వామివారి రథయాత్రను కనులారా వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా అర్చకులు స్వామివారికి ఉదయం గ్రామబలిహరణం చేపట్టి శ్రీరాముడి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణ, వేదపఠనం, వైదిక సదస్యం తదితర కార్యక్రమాలను జరిపించారు. వేద పండితులంతా సాయంత్రం పండిత పరిషత్‌ను నిర్వహించి నాలుగువేదాలను భక్తిశ్రద్ధలతో పఠించారు. స్వామివారి విశేషాన్ని వివరిస్తూ మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక మంటపంలో వేంచేపుచేసి పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలనంతరం విగ్రహాలను పవిత్ర రథంపై ఆసీనులను చేసి రథయాత్రకు సిద్ధం చేశారు.

ఊరేగిన రాములోరు

వేద పండితుల వేదమంత్రోచ్చారణ, భక్తుల జయజయధ్వానాల నడుమ సీతారామ లక్ష్మణులు రామతీర్థం పురవీధుల్లో ఊరేగి వేలాది మంది భక్తులకు కనువిందు చేశారు. ఉత్తర రాజగోపురం సమీపంలోని ప్రధాన రహదారి నుంచి కుమ్మరి కానా మీదుగా ఆలయం వరకు జరిగిన ఈ రథయాత్రతో రామతీర్థం పులకించింది. ఆలయ ప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి ఆనవాయతీగా వస్తున్న సీతారామునిపేట, జగ్గరాజుపేట, గొర్లిపేట గ్రామాలకు చెందిన భక్తులు ఈసారి కూడా రథాన్ని లాగి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు ముందు స్వామివారి సన్నిధిలో నిర్వహించిన పండిత పరిషత్ ఎంతో వైభవంగా జరిగింది. ఈ పరిషత్‌లో సీతారాముల గుణగణాలను తెలియపర్చడానికి వేదపండితులు పోటీపడిన సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులను దేవస్థానం తరఫున ఘనంగా సన్మానించారు.

పోటెత్తిన భక్తులు

స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన రథయాత్రకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముఖ్యంగా విజయనగరం, నెల్లిమర్ల ప్రాంతాలతో పాటు ఏటీ అగ్రహారం, దన్నానపేట, తంగుడుబిల్లి, గొర్లిపేట, కొత్తపేట, సతివాడ, రామతీర్థం, ఒమ్మి, తదితర చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి రథయాత్ర మహోత్సవాన్ని కనులారా తిలకించారు. పూజా సామగ్రిని రథం పైకి విసిరి స్వామివారిని దర్శించుకున్నారు. రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, వరప్రసాద్, కిరణ్, పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమాన్ని వేడుకగా జరిపించారు.

వైభవంగా పూర్ణాహుతి

రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు మంగళవారం అత్యంత వైభవంగా జరిపించారు.పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాల భోగం నిర్వహించిన తరువాత యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక సర్గ హవనం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



ఆలయంలో పండిత పరిషత్ నిర్వహిస్తున్న అర్చకులు

పది పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- మార్చి 17 నుంచి 31 వరకు షెడ్యూల్
- కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లాలో 119 కేంద్రాలు.. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెగ్యులర్, ఓపెన్ స్కూల్స్ పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు పది పరీక్షల ఏర్పాట్లపై కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రెగ్యులర్, ప్రైవేట్ కలిపి జిల్లాలో పది పరీక్షలు రాస్తున్న 23,765 మంది విద్యార్థుల కోసం 119 పరీక్ష కేంద్రాలను, ఓపెన్ స్కూల్స్ నుంచి రెగ్యులర్ 460 మంది, ప్రైవేట్‌గా 614 మంది విద్యార్థుల కోసం 27 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా ఎక్కడా కాపీ జరగకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్ అధికారిని నియమించాలని, 7 ఫ్లయింగ్ స్కాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్, నెట్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. ప్రశ్నపత్రాలను నిల్వ ఉంచేందుకు గాను విజయనగరం, గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట పోలీస్‌స్టేషన్లలో కస్టోడియన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాస్థాయిలో ఒక స్ట్రాంగ్ రూమ్ డీఆర్‌ఓ ఆధ్వర్యంలో ఉండాలని తెలిపారు. 9 రూట్‌లను ఏర్పాటు చేసి ఈఓపీఆర్‌డీ లేదా డిప్యూటీ తహసీల్దార్‌లను రూట్ ఆఫీసర్లుగా నియమించాలని చెప్పారు.

నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి

కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లు, డీపీఓను ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షల సమయంలో అవసరమైన బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షల పర్యవేక్షణకు మండలస్థాయిలో ఉన్న గెజిటెడ్ అధికారులను వేయాలని అన్ని కేంద్రాలను ప్రతిరోజూ సందర్శించి, ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా ప్రతి ఒక్కరూ చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

3 లక్షల దోమల తెరల పంపిణీకి ప్రతిపాదనలు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు
- దోనుబాయి, మర్రిపాడు పీహెచ్‌సీల సందర్శన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో 3లక్షల దోమతెరల పంపిణీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని దోనుబాయి, మర్రిపాడు పీహెచ్‌సీలను సందర్శించారు. ఓపీ వివరాలు, రికార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. మందులన్నీ అందుబాటులో ఉన్నాయా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బందికి పలు సూచనలిచ్చారు. పీహెచ్‌సీల పెర్ఫార్మెన్స్ బాగా ఉండాలని కోరారు. సూపర్‌వైజర్ల పనితీరు మెరుగుపడాలని సూచించారు. అనంతరం స్థానిక వైటీసీలోని గర్భిణుల వసతిగృహాన్ని తనిఖీ చేసి గర్భిణులతో మాట్లాడారు. వైద్యాధికారులతో అక్కడే సమావేశం ఏర్పాటుచేశారు. బర్త్‌వెయిటింగ్ రూమ్‌లకు గర్భిణులను వారం రోజుల ముందు చేర్చాలని చెప్పారు. రానున్న ఎపిడమిక్ సీజన్‌లో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దోమల నివారణ మందు స్ప్రేయింగ్ గ్రామాల్లో తూతూ మంత్రంగా చేయవద్దని, దండోరా వేయాలని చెప్పారు. గతంలో 90 రోజుల్లో రెండు సార్లు పిచికారీ చేసేవారమని, ఇప్పుడు మూడు రౌండ్లు చేయనున్నట్టు తెలిపారు. వసతిగృహాల్లో కూడా స్ప్రేయింగ్ చేయాలన్నారు. జిల్లాలో 12 మంది వైద్యాధికారులు పీజీ కోర్సులకు వెళ్లనుండడంతో వారి స్థానాల్లో కొత్త వారిని రిక్రూట్ చేయడానికి చేయడానికి కలెక్టర్‌కు ప్రతిపాదించామన్నారు. కార్యక్రమంలో కుష్ఠువ్యాధి నివారణాధికారి వినోద్‌కుమార్, డిప్యూటీడీఎంహెచ్‌వో విజయపార్వతి, వైద్యాధికారులు సాయిచరణ్, భానుప్రతాప్, చాందిని, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంచాలి

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ వకుల్ జిందల్



భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణను సత్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ స్టేషన్‌లలో పనిచేస్తున్న పోలీసు అధికారులతో ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మంచిగా ప్రవర్తించి, పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారు స్టేషన్‌కి ఏ కారణంతో వచ్చిందీ తెలుసుకుని వారు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, పరిష్కార మార్గాలను చూపాలని, ఫిర్యాదులను స్వీకరించాలని చెప్పారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను సందర్శించాలని, రాత్రి పెట్రోలింగ్ సమయంలో విధిగా లాఠీ, విజిల్, టార్చిలైట్‌తో పాటు, వాహనానికి పోలీస్ సైరన్ ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వేలిముద్రలను తనిఖీ చేయాలని, పోలీసుస్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాలకు అందజేసిన ఎఫ్‌పీబీ చెక్ డివైజ్‌లను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. గంజాయి, చోరీలు నియంత్రించడంలోనూ, లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను డిస్పోజ్ చేయడంలోనూ, దర్యాప్తు కేసులను తగ్గించడంలోనూ, నిందితులకు న్యాయస్థానంలో శిక్షలు పడేవిధంగా చేయడంలోనూ, సీసీటీఎన్‌ఎస్‌లో కేసుల వివరాలను సకాలంలో అప్‌లోడ్ చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పి జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డీఎస్పి ఎస్.రాఘవులు, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం, న్యాయసలహాదారులు వై.పరశురాం, పలువురు సీఐలు, ఆర్‌ఐలు, వివిధ పోలీసుస్టేషన్‌ల ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు కుసుమంతరావు

రాజాం సిటీ: బాగా చదువుకుని ప్రయోజకుడై తమను ఆదుకుంటాడని అనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. చదువులో చురుగ్గా ఉండడంతో ఇంకా బాగా చదవాలని రాజాంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి చదివిస్తున్నారు. వారి ఆశలపై విధి కన్నెర్రజేయడంతో ఆ బాలుడు అకాల మరణం చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన దువ్వారపు లక్ష్మణ, భవానీల చిన్న కుమారుడు కుసుమంతరావు (8) మంగళవారం సాయంత్రం గ్రామంలోని రాజాం-చీపురుపల్లి ప్రధాన రహదారి పక్కన ఓ నీటి కుంటలో పడి మృతిచెందాడు. ఎప్పటిలాగానే స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటి కుంటలో కుసుమంతరావు పడిపోయిన విషయం గమనించిన తోటి పిల్లలు కుటుంబసభ్యులతోపాటు గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని కుంటలో నుంచి బయటకు తీసి సపర్యలు చేసి రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలపడంతో భోరున విలపించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పదో తరగతి అర్హతతో పోస్టల్‌లో ఉద్యోగాలు

పోస్టుల వివరాలు				
పోస్టు	పార్వతీపురం మన్యం జిల్లా	విజయనగరం జిలా	శ్రీకాకుళం జిల్లా	మొత్తం
బీపీఎం	16	6	0	22
ఏబీపీఎం	8	3	2	13
డాక్‌సేవక్	3	1	0	4
మొత్తం	27	10	2	39



పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు

పార్వతీపురం టౌన్: పదో తరగతి అర్హతతో పోస్టల్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో మొత్తం 39 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని అందులో పార్వతీపురం జిల్లా పరిధిలో 27, విజయనగరం జిల్లా పరిధిలో 10, శ్రీకాకుళం జిల్లా పరిధిలో 2 పోస్టులు విడుదల చేసినట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు మెరిట్‌పై ఆన్‌లైన్‌లో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి మార్చి 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో తప్పులుంటే మార్చి 6 నుంచి 8 వరకు ఎడిట్ ఆప్షన్ ఉంటుందని ఆ సమయంలో సరి చేసుకోవచ్చునన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయం పోటీలకు ఆహ్వానం



పోటీల కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌వీఆర్ కళాపరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తులసీదాస్, వెంకటినాయుడు

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి 99వ జాతర(మార్చి 9)ను పురస్కరించుకుని ఉత్తరాంధ్రస్థాయి పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాల్లోని ఏకపాత్రాభినయం పోటీలు రాజాంలో నిర్వహించనున్నట్టు సలాది వెంకటరమణ కళాపరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలాది తులసీదాస్, ఆర్నిపల్లి వెంకటినాయుడు తెలిపారు. బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ ఆవరణలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. పోటీలకు మహిళా కళాకారులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. పోటీల నిడివి 15 నుంచి 20 నిమిషాల పాటు ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 20లోగా తమ ఎంట్రీలను ఆర్నిపల్లి వెంకటినాయుడు, ఎస్‌వీఆర్ కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి, రాజాం పేరుతో పంపించాలని తెలిపారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు. ఇందులో మొదటి బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ. 5వేలు, తృతీయ బహుమతి రూ. 4వేలతో పాటు ప్రదర్శనా పారితోషికం రూ.500లు అందజేస్తామన్నారు. ఎంట్రీలను ఆర్నిపల్లి వెంకటినాయుడు, ప్రధాన కార్యదర్శి, ఎస్‌వీఆర్ కళాపరిషత్, అమ్మవారి కాలనీ, రాజాం, 532127 పేరిట పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 94417 56874, 94915 69723 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



గూడ్స్ ఢీకొని మృతి చెందిన అప్పలరాజు

కొత్తవలస: మండలంలోని కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి గూడ్స్ ఢీకొట్టడంతో కొత్తవలస గ్రామం కుమ్మరివీధికి చెందిన బొబ్బరి అప్పలరాజు (43) మృతి చెందాడు. అప్పలరాజు ఆటోడ్రైవర్‌గా పని చేస్తుంటాడు.ఈ క్రమంలో సోమవారం రాత్రి విధులు ముగించుకుని రైలుపట్టాలు దాటి ఇంటికి వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా మంగళవారం ఉదయం గుర్తు తెలియని శవం పట్టాల సమీపంలో ఉందని జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావుకు సమాచారం ఇవ్వగా ఆయన సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి స్థానిక వ్యక్తేనని గుర్తించారు. ఈ మేరకు మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెట్టుపై నుంచి జారి పడి వ్యక్తి..

కొమరాడ: మండలంలోని దేవుకోన గ్రామానికి చెందిన కేలే నారాయణరావు(40) చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందినట్లు ఎస్సై నీలకంఠం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరావు మేకల మేత కోసం ఇంటి ముందు ఉన్న చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడిపోగా వెంటనే విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించేపట్టికే మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి అమ్మడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్..



బోల్తాపడిన ట్రాక్టర్

సాలూరు రూరల్: మండలంలోని అన్నం రాజువలస పంచాయతీ పసువువాని వలస గ్రామం వద్ద సోమవారం రాత్రి 12గంటల సమయంలో టేకు దుంగలతో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మడక తిరుపతి(45) మృతిచెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పసుపువానివలస గ్రామం నుంచి కటింగ్ చేసిన టేకు దుంగలు తెర్లాం మండలం సంగిరెడ్డి వలసకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తరలిస్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. రూరల్ ఎస్సై నరసింహమూర్తి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి..

రాజాం సిటీ: తన పాన్‌షాపు, ఇంటి ఆవరణలో భార్యతో మాట్లాడుతున్న ఓ వ్యక్తిని మృత్యువు బైక్ రూపంలో దూసుకొచ్చి బలిగొంది. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలి లా ఉన్నాయి. మండల పరిధి ఒమ్మి పంచాయతీ కొత్తపేట వద్ద రోడ్డు పక్కన పాన్‌షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న బండారు మాధవరావు (55) ద్విచక్రవాహనం ఢీకొని మృతిచెందాడు. ఎప్పటిలాగే మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో వరండాలో కూర్చుని ఉన్నాడు. ఇంతలో రాజాం నుంచి తెర్లాం వైపు అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి మాధవరావును ఢీకొంది. ఈ ఘటనలో మాధవరావు అక్కడికక్కడే మృతిచెందగా బైక్‌పై వస్తున్న వ్యక్తికి కూడా తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించగా అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం రిఫర్ చేశారు.



మాధవరావు (ఫైల్)

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మృతదేహం పక్కన పురుగు మందు డబ్బా లభించిందని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టామని, ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

జ్యూయలరీ షాపు యజమాని ఇంట్లో చోరీని ఛేదించిన పోలీసులు

- 45 తులాల బంగారు ఆభరణాలు రికవరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్, పరారీలో ప్రధాన నిందితుడు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: బొబ్బిలి పట్టణంలోని చిన్న బజారులో ఈ నెల ఒకటో తేదీన రాత్రి జరిగిన చోరీ కేసును ఛేదించి చోరీకి సహకరించిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, చోరీ చేసిన 45 తులాల బంగారు వస్తువులను రికవరీ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణానికి చెందిన జ్యూయలరీ షాపు యజమాని గ్రంధి రవికుమార్ ఈ నెల 2వ తేదీన తన ఇంటి తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలో ఉన్న బంగారు వడ్డాణం, గాజులు, గొలుసులు, బ్రాస్‌లెట్లు, తదితర రూ.10.50 లక్షలు విలువ చేసే 45 తులాల బంగారు వస్తువులను చోరీ చేసినట్లు బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు విచారణలో పలు ఆధారాలను సేకరించి బొబ్బిలి మండలంలోని గున్నతోటవలసకు చెందిన పెంకి శ్రీనివాసరావు (ఎ2), పాత బొబ్బిలికి చెందిన బత్తుల సర్వేశ్వరరావు (ఎ3), ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ నరసింగరావు (ఎ4) అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. విచారణలో నిందితులు పేకాట, ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో పాత నేరస్తుడు సీతానగరం మండలం జోగింపేట గ్రామానికి చెందిన (ఎ1) పోలా భాస్కరరావుతో పరిచయం కాగా దొంగతనాలు చేసేందుకు ఇల్లు చూపిస్తే, చోరీ చేసిన వస్తువుల్లో వాటా ఇచ్చేందుకు వారి మధ్య ఒప్పందం కుదిరింది.

బంగారం అమ్మేందుకు వెళ్తుండగా పట్టివేత

నిందితులు పెంకి శ్రీనివాసరావు, బత్తుల సర్వేశ్వరరావులు పోలా భాస్కరరావుకు చోరీ చేసేందుకు ఫిర్యాదుదారు ఇంటిని చూపించగా, పలుమార్లు రెక్కీ నిర్వహించి, చివరకు ఫిబ్రవరి 1న అర్ధరాత్రి దాటిన తర్వాత పోలా భాస్కరరావు ఇంట్లోకి ప్రవేశించి, దొంగతనానికి పాల్పడ్డాడు. తరువాత తనకు పరిచయమున్న పాత నేరస్తుడు ముద్దాడ నరసింగరావు సహకారంతో బంగారు వస్తువుల్లో కొన్నింటిని కరిగించి, కడ్డీలుగా మార్చాడు. అనంతరం దొంగిలించిన వస్తువులను అమ్మేందుకు శ్రీనివాసరావు, బత్తుల సర్వేశ్వరరావు, నరసింగరావులు రాయగడ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. పరారీలో ఉన్న భాస్కరరావు గురించి గాలిస్తున్నామని, ప్రధాన నిందితుడిని కుడా త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసిన బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్సై ఆర్.రమేష్‌కుమార్, ఏఎస్సై బీవీ.రమణ, కానిస్టేబుళ్లు ఎస్.రామారావు, యు. శ్రీరాములు, ఎస్.శ్రీహరి, అప్పారావులను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తతే ప్రధానం

విజయనగరం అర్బన్: ఆన్‌లైన్ సేవలపై అప్రమత్తతే ప్రధానమని జిల్లా ఇన్‌ఫర్మేటిక్ అధికారి ఆర్.నరేంద్ర అన్నారు. ఎలక్ట్రానిక్స్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ సూచన విజ్ఞాన కేంద్రం (ఎన్‌ఐసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో మంగళవారం 'సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులకు అంతర్జాల సేవలు సురక్షితంగా ఎలా వినియోగించాలనే అంశంపై అవగాహన కల్పించారు. డిజిటల్ గుర్తింపు, వ్యక్తిగత సమాచారాన్ని అనధికారిక వెబ్‌సైట్లలో షేర్ చేయరాదని, వన్‌టైమ్ పాస్‌వర్డ్ సమాచారాన్ని ఇతరులతో పంచుకోరాదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ పి.బాలాజీ, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్, ఇన్‌ఫర్మేటిక్ అధికారి ఎ.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.